సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 10 । జనవరి । 2023



హాకీ జట్టు ఎంపిక

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ హాకీ బాలికల జట్టును సోమవారం ఎంపిక చేశారు.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో 73 వినతులు నమోదయ్యాయి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.0 /12.5

వాతావరణం

చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

భర్త మరణిస్తే భార్యకు పింఛన్ బదలాయింపు

■ సర్క్యులర్ జారీ చేసిన ప్రభుత్వం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మధ్యలోనే మరణిస్తే వెంటనే ఆ పింఛన్‌ను భార్యకు బదలాయింపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సెర్ప్ సీఈవో సందీప్ కుమార్ సుల్తానియా సర్క్యులర్ జారీ చేశారు. రాష్ట్ర శాఖ ఆదేశాలందుకున్న జిల్లా సెర్ప్ అధికారులు ఎంపీడీవోలకు సర్క్యులర్‌ను పంపించారు. వృద్ధాప్య పింఛన్ తీసుకున్న భర్త ఒకవేళ మరణిస్తే భార్యకు పింఛన్ వచ్చేలా చూడాలని సూచించారు. భర్త డెత్ సర్టిఫికెట్‌తో పాటు భార్య ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలను పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు కలెక్టర్ లాగిన్‌కు చేరవేయాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కలెక్టర్ లాగిన్ నుంచి రాష్ట్ర సెర్ప్ శాఖకు పంపుతారు. అక్కడ 45 రోజుల్లోగా భార్యకు పింఛన్ మంజూరు చేయనున్నారు. భర్తను కోల్పోయిన మహిళను వెంటనే ఆదుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి గాను నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఫిబ్రవరి 16 తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష నిర్దేశించిన కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 8 తేది నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు మార్చి 25న సర్టిఫికెట్ల పరిశీలన, అడ్మిషన్ ఉంటుందన్నారు.

బెస్ట్ అవైలబుల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌లో చేరడానికి ప్రైవేటు పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి శశికళ సోమవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఆసక్తి గల పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకటో తరగతిలో నాన్‌రెసిడెన్షియల్‌లో 176 సీట్లు, 5వ తరగతిలో 238 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో పాటు విద్యాశాఖ అనుమతి పొంది ఉండాలన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ, మౌలిక వసతులు ఉండాలని పేర్కొన్నారు. ఐదేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణ ఉండాలన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు నాన్‌రెసిడెన్షియల్‌లో రూ. 28 వేలు, రెసిడెన్సియల్‌లో రూ. 42వేలు ఒక్కో విద్యార్థికి చెల్లించడం జరుగుతుందన్నారు. ఈనెల 25 తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

18న ఎంఈడీ పార్ట్‌టైం అధ్యాపకులకు పరీక్ష

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ ఎంఈడీ కోర్సులో బోధనకు పార్ట్ టైం అధ్యాపకులకు ఈనెల 18న ఉదయం 10 గంటలకు రాత పరీక్ష, మధ్యాహ్నం 2 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో రాత పరీక్ష, గెస్ట్ హౌస్‌లో మౌఖిక పరీక్ష జరుగుతుందన్నారు.


సంక్రాంతికి ఊరికి వెళ్తే జాగ్రత్తగా ఉండాలి

ఖలీల్‌వాడి : పండుగ వేళల్లో ఊరికి వెళ్తే జాగ్రత్తలు పాటించాలని సీపీ కేఆర్ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంక్రాంతికి ఊరికి వెళ్తే ఇంట్లో ఖరీదైన వస్తువులు ఉంచవద్దని, బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఇరుగుపొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలన్నారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఉదయం వేళ రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, హార్ ఏక్ మాల్, ఇతర వస్తువులను విక్రయించే వారి పై నిఘా పెట్టాలన్నారు. దొంగలు ఉదయం వేళ తాళం వేసిన ఇళ్లను గమనించి రాత్రి వేళ చోరీలకు పాల్పడతారన్నారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

హద్దుల్లేని అక్రమాలు

- ఆర్మూర్ మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు
- కోర్టు కేసు నడుస్తున్న భూములకు సైతం..
- అసైన్డ్ భూమి, ఇరిగేషన్ భూమి తేడా లేకుండా నిర్మాణాలు

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలకు హద్దు లేకుండా పోతోంది. ఏకంగా అసైన్‌మెంట్ భూముల్లో వెంచర్లు వెలుస్తుండగా.. అక్కడ ఒక్క ఇల్లు కూడా కట్టకున్నప్పటికీ ఖాళీ జాగాలకు అధికారులు ఇంటి నంబర్లు కేటాయించారు. ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనంలో బార్ ఏర్పాటు చేశారు. ఈ బార్‌కు సైతం ఇంటి నంబర్ ఇచ్చారు. ఇటీవల బలవన్మరణం చెందిన ఇరిగేషన్ డీఈఈ విషయంలోనూ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు.



యానంగుట్ట వద్ద నంబర్లు కేటాయించిన ఖాళీ అసైన్డ్ స్థలాల మ్యాప్



ఆర్మూర్‌లోని ఇరిగేషన్ స్థలంలో నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన బార్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : దినదినాభివృద్ధి చెందుతున్న ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలకు హద్దు లేకుండా పోతోంది. అంతా తమ ఇష్టారాజ్యం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. పరిస్థితి ఏవిధంగా తయారైందంటే ఏకంగా ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు కేటాయిస్తున్నారు. పట్టణంలోని యానంగుట్ట ప్రాంతంలో అసైన్‌మెంట్ కింద కొందరికి కేటాయించిన భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి కొనుగోలు చేసి వెంచర్ చేశాడు. ఇది నాన్ లేఅవుట్ అయినప్పటికీ.. ఇక్కడ ఒక్క ఇల్లు కూడా కట్టకున్నా ఖాళీ జాగాలకు మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించారు. ఇదిలా ఉండగా హౌసింగ్ బోర్డు ఏరియాలో పంపకాల తేడా వల్ల కుటుంబ తగాదాలు చోటుచేసుకుని కోర్టులో ఉన్న నాలుగెకరాల భూమికి సంబంధించి వ్యవహారం తేలకుండానే అందులో ప్లాట్లు చేశారు. వాటికి సైతం మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడం అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తోంది. ఈ వ్యవహారాలకు సంబంధించి పలు వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఒత్తిళ్లు భరించలేక మున్సిపల్ కమిషనర్ ఇటీవల సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌తో ఇష్టం వచ్చినట్లు వ్యవహారాలు నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ఇన్‌చార్జి కమిషనర్‌కు ఫుల్ అడిషనల్ చార్జ్ ఇప్పించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు విపక్ష నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఇదిలాఉండగా ఇరిగేషన్ శాఖలో ఆర్మూర్ డీఈఈగా పనిచేస్తూ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వెంకటరమణారావు విషయంలోనూ అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై బీజేపీ నేత, ఆర్మూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు తీవ్ర ఆరోపణలు చేశారు. జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు చెప్పిన మేరకు రూ.2 కోట్ల పనులకు సంబంధించి ఎంబీ రికార్డులపై వెంకటరమణారావు సంతకాలు చేశారన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తిట్టడంతో పాటు, బలవంతంగా సెలవుపై పంపించారన్నారు. ఈ క్రమంలో గత 11 నెలలుగా ఇతర ప్రాంతానికి బదిలీ కోసం వెంకటరమణారావు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలైట్ బార్ విషయంలోనూ ఇష్టారాజ్యమే..

మున్సిపాలిటీ పరిధి పెర్కిట్ ఏరియాలోని ఇరిగేషన్ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భవనం నిర్మించి ఎలైట్ బార్ ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణం అడ్డుకోవాలని 2021 జనవరి 30న అప్పటి ఇరిగేషన్ డీఈఈ జె కృష్ణమూర్తి మున్సిపల్ కమిషనర్‌కు, తహసీల్దార్‌కు లేఖలు రాశారు. అయినప్పటికీ నిర్మాణం ఆగలేదు. పైగా అప్పటి మున్సిపల్ కమిషనర్ శైలజ ఈ అక్రమ నిర్మాణానికి ఇంటి నంబరు కేటాయించడం విశేషం. దీనిపై బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేయడంతో సదరు ఇంటి నంబరును 2022 అక్టోబర్ 20న రద్దు చేశారు. ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం కావడంతో నంబర్ రద్దు చేసినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ, సదరు నిర్మాణాన్ని కూల్చివేయకపోవడం గమనార్హం. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చేయాల్సి ఉంది. అయినప్పటికీ కూల్చలేదు. పైగా ఈ అక్రమ నిర్మాణంలో ఎలైట్ బార్ యథేచ్ఛగా కొనసాగుతుండడం విశేషం. ఇంటి నంబర్ రద్దు కావడంతో సదరు ఎలైట్ బార్ నిర్వాహకులకు ఎలాంటి పన్నులు సైతం లేకుండా మున్సిపల్ అధికారులు సహకరిస్తుండటం విడ్డూరం. ఈ విషయాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.



సైలెన్సర్ల ధ్వంసం

ఖలీల్‌వాడి: ప్రజలను శబ్ద కాలుష్యంతో ఇబ్బందులకు గురిచేస్తున్న బైక్ సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు రోడ్డురోలర్‌తో తొక్కించారు. భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను కొందరు బైకులకు బిగించి సౌండ్ పొల్యూషన్ చేస్తుండడంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. సుమారు 100 సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని సోమవారం నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరంలోని ధర్నా చౌక్ వద్ద రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ నారాయణ మట్లాడుతూ రూ. 3 లక్షల విలువైన సైలెన్సర్లను ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, పోలీసులు పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం

- విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- కేసులు ఎత్తివేయాలని డిమాండ్

ఖలీల్‌వాడి: బెయిలిఫ్, న్యాయవాది, ఇతరులపై కేసు నమోదు చేసిన అధికారితో పాటు పోలీసులపై పరువు నష్టం దావా వేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి అన్నారు. సోమవారం నగరంలోని జిల్లా కోర్టు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడతూ ఎస్సారెస్పీ భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉత్తర్వుల మేరకు కలెక్టరేట్‌కు వెళ్లిన వారిపై కేసు నమోదు చేయడం సరైనది కాదన్నారు. తక్షణమే కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యకు న్యాయపరంగా పోరాటం చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. న్యాయవాది, బెయిలిఫ్, ఇతరులపై కేసుల నమోదుపై రాష్ట్ర వ్యాప్తంగా విధులు న్యాయవాదులు బహిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, దయాకర్‌గౌడ్, ఆకుల రమేశ్, గంగాధర్, ఆశ నారాయణ న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన అడిషనల్ కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, మన ఊరు – మన బడి, హరితహారం, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుతెన్నులను మండల ప్రత్యేకాధికారులు నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు – మన బడి పనుల ప్రగతిని సమీక్షించాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవోలు జెనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ సక్రమంగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే పంచాయతీ కార్యదర్శులను ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడైనా మొక్కలు పాడైపోతే, వాటి స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేయించి, అవి ఏపుగా పెరిగేలా నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. ప్రతి పంచాయతీ, ఆవాస ప్రాంతాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు కావాలన్నారు. కాగా వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా, పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంక్రాంతి తర్వాత ప్రత్యేక పునఃశ్చరణ తరగతుల నిర్వహణ, ప్రేరణ కార్యక్రమాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని డీఐఈవో రఘు రాజ్, డీఈవో దుర్గాప్రసాద్‌ను ఆదేశించారు. శాఖా పరమైన పనులు పెండింగ్‌లో ఉండకుండా, వెంటనే పూర్తిచేయాలని అధికారులకు హితవు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బెల్లం తయారీపై నిషేధం ఎత్తివేయాలి

- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో బెల్లం తయారీపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని కోరుతూ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి ప్రాంతంలో ప్రభుత్వ చెరుకు ఫ్యాక్టరీలను నిర్వీరం చేయడంతో రైతులు చెరుకు పంటను ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. తెలంగాణకు ఇరుపక్కల గల ఏపీ, మహారాష్ట్రలలో కూడా బెల్లం తయారీపై ఆంక్షలు లేవని, తెలంగాణలోనే ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. కామారెడ్డిలో మాస్టర్‌ప్లాన్ పేరుతో చెరుకు పండే భూములను తీసుకుంటుందని, ప్రభుత్వానికి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలనే ఉద్దేశం ఉంటే చెరుకు పరిశ్రమను తీసుకువచ్చి రైతులకు మేలు చేయాలన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కామారెడ్డిలో మాస్టర్ ప్లాన్ కింద అసైన్డ్ భూములను తీసుకుంటున్నామని అంటున్నారు. అసైన్డ్ భూముల్లో పంటలు పండడం లేదా అని ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లాలో మాస్టర్ ప్లాన్ అమలు పేరిటా రైతులకు చెందిన భూముల విషయంలో కలెక్టర్, కామారెడ్డి ఎమ్మెల్యేలు చెరో మాట మాట్లాడుతూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. వారం రోజులుగా మాస్టర్ ప్లాన్ వివాదం జరుగుతుంటే మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఒక్క మాటైనా మాట్లాడడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ అభివృద్ధికి ఎప్పుడు వ్యతిరేకం కాదని, రైతులకు ఉపయోగపడే ఇండస్ట్రీస్ తీసుకువస్తే ప్రభుత్వానికి సహకరిస్తామని, లేదంటే ఉద్యమిస్తామన్నారు.

‘పసుపు’పై ప్రభుత్వాల డ్రామా

పసుపు పంటకు మద్ధతు ధర కల్పిస్తామని, స్పైస్ బోర్డు తీసుకువస్తామని బీజేపీ, టీఆర్ఎస్‌లు ప్రకటన చేసి మూడేళ్లవుతుందని అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. టీఆర్ఎస్, బీజేపీలు ఈ విషయాన్ని రాజకీయం చేసి ఒకరిపై ఒకరు మాట్లాడుకుంటూ ఓ డ్రామా సృష్టించి పసుపు సమస్య లేదన్నట్లు రెండు పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి రాజరెడ్డి, నరాల రత్నాకర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఎముకలు కొరికే చలి

- సోమవారం 12.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం
- అత్యంత తక్కువగా చిన్నమావందిలో 7.7 డిగ్రీలు
- చలిగాలులతో వణికిపోతున్న ప్రజలు

సుభాష్‌నగర్: జిల్లాను చలి గజగజ వణికిస్తోంది. నాలుగు రోజులుగా పగలు, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పడిపోతున్నాయి. సోమవారం సీజన్‌లోనే అత్యల్పంగా 12.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బోధన్ మండలంలోని చిన్నమావందిలో అయితే కనిష్ట ఉష్ణోగ్రతలు ఏకంగా 7.7 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయం 8 గంటలైనా పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉన్ని దుస్తులు ధరిస్తూ ఇళ్లకే పరిమితమవుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

వారం రోజులుగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తద్వారా చలి విపరీతంగా పెరిగిపోయింది. వాహనదారులు, చిరు వ్యాపారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడ్రోజులుగా దట్టంగా పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో చిన్నచిన్న రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం చిన్నమావందిలో అత్యల్పంగా 7.7 డిగ్రీలు, నవీపేట్‌లో అత్యధికంగా 15.0 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈసారి కనిష్ట ఉష్ణోగ్రతలు గతేడాది కంటే తక్కువకు పడిపోయే అవకాశముంది.

బయటకు రావాలంటే..

జిల్లాలో నమోదవుతున్న కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు ఇలాగే కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఒక దశలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముంది. చలి తీవ్రత పెరుగుతుండడంతో ఉదయం బయటకు రావాలంటే జనం వణికిపోతున్నారు. తొమ్మిది గంటలైనా బయటికి రాలేకపోతున్నారు. అదేవిధంగా రాత్రి పూట 8 గంటలు కాకముందే ఇళ్లకు చేరుకుంటున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చలి బారి నుంచి తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు, స్వెటర్లు ధరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా, ఇతర వ్యాధులు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరో మూడు రోజులు చలి గాలులు

రుద్రూర్: రానున్న మూడు రోజులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నట్లు రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయన్నారు. రాత్రి(కనిష్ట) ఉష్ణోగ్రతలు సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 3 నుంచి 5 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కన్నా తక్కువగా నమోదైనట్లు తెలిపారు.



నగరంలో ఉదయం కమ్ముకున్న పొగమంచు

తేదీ	కనిష్టం	గరిష్టం
3న	20.5	32.1
4న	19.9	31.1
5న	20.0	30.0
6న	18.5	29.0
7న	18.3	29.2
8న	14.3	28.9
9న	12.5	28.2

సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

గ్రామం	కనిష్ట ఉష్ణోగ్రతలు										
		కోటగిరి	10.2					మగ్గిడి	13.9	నిజామాబాద్ నార్త్	14.2
చిన్నమావంది	7.7	గన్నారం	10.3	వేంపల్లి	11.7	జాకోరా	12.6	జక్రాన్‌పల్లి	13.9	బెల్లాల్	14.2
మెండోరా	9.1	భీమ్‌గల్	10.5	రుద్రూరు	11.9	కొరట్‌పల్లి	12.7	ఇస్సాపల్లి	14.1	మదన్‌పల్లి	14.2
మంచిప్ప	9.3	సాలూర	10.7	ఏర్గట్ల	12.1	కమ్మర్‌పల్లి	13.0	సీహెచ్ కొండూరు	14.2	పాల్దా	14.5
కల్దుర్కి	9.4	కోనసముందర్	11.0	ధర్పల్లి	12.2	రెంజల్	13.0	మోర్తాడ్	14.2	ముప్కాల్	14.6
మోస్రా	9.5	బాల్కొండ	11.4	ఎడపల్లి	12.2	ఆలూరు	13.2	గూపన్‌పల్లి	14.2	లక్ష్మాపూర్	14.6
తూంపల్లి	9.5	వేల్పూర్	11.4	డిచ్‌పల్లి	12.3	సిరికొండ	13.5	పెర్కిట్	14.2	మచ్చర్ల	14.8
జానకంపేట	10.2	చందూరు	11.5	నిజామాబాద్	12.4	తొండకూర్	13.9	మల్కాపూర్	14.2	నవీపేట	15.0

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 73 వినతులు
- పరిష్కరించి అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్‌ ఆదేశం



కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ నారాయణ రెడ్డి, అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం కొత్త కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్‌, చిత్రామిశ్రా, డీఆర్డీవో చందర్‌ నాయక్‌, జెడ్పీ సీఈవో గోవింద్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయడంతోపాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు సర్వే చేయాలి

నిజామాబాద్‌ మాస్టర్‌ప్లాన్‌లోని వినాయక్‌నగర్‌, గాయత్రినగర్‌ నుంచి రేడియోస్టేషన్‌ మీదుగా నాగారం వరకు ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డు సర్వే చేయాలని మాస్టర్‌ప్లాన్‌ బాధితుల కమిటీ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ నారాయణరెడ్డి వినతి పత్రం అందజేశారు. ప్రతిపాదిత రోడ్డు ఏ సర్వేనెంబర్లు, ప్లాట్స్‌ గుండా పోతుందో అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. రోడ్డు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కన్వీనర్‌ కె రామ్మోహన్‌ రావు, విజయ్‌కుమార్‌, రాములు, రాజు, రాంచందర్‌, పుండరీ, గంగాధర్‌ కోరారు.

కుక్కలు, కోతులతో ఇబ్బందులు..

నగరంలోని అన్ని డివిజన్లలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, తద్వారా పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘర్షణ సమితి నగర అధ్యక్షుడు ముత్తెనపల్లి నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి లో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కుక్కలు, కోతులు విరుచుకుపడటంతో గాయాల బారిన పడుతున్నారని, మున్సిపల్‌ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరడంతో మున్సిపల్‌ అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు.

దోబీఘాట్‌కు స్థలాన్ని అప్పగించాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రజక సంఘం నాయకులు

సుభాష్‌నగర్‌ : మోపాల్‌ మండలంలోని సిర్‌పూర్‌ గ్రామంలో 2007లో దోబీఘాట్‌ కోసం కేటాయించిన రెండెకరాల స్థలాన్ని తిరిగి అప్పగించాలని జిల్లా రజక ఐక్యవేదిక అధ్యక్షుడు గూపన్‌పల్లి శంకర్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌ మాట్లాడుతూ 2007లో రెండెకరాల స్థలం కేటాయించడంతో దోబీఘాట్‌ నిర్మాణం చేపట్టామని, కరోనా కారణంగా ఇళ్లల్లోనే వృత్తిని చేపడుతున్నామన్నారు. దోబీఘాట్‌కు ఇచ్చిన స్థలాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు క్రీడామైదానం, మున్నూరుకాపు కులం కల్యాణమండపం, కల్లు బట్టీకి కేటాయించారని, మిగిలిన స్థలాన్ని ఓ రైతు దున్నుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. పేద కుటుంబాల జీవన మనుగడ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, తిరిగి తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్‌తో సర్వే చేయించి న్యాయం చేస్తానని కలెక్టర్‌ హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం గ్రామ అధ్యక్షుడు డి సంజీవ్‌, భూమయ్య, ప్రసాద్‌, గణేష్‌, నాగేష్‌, మాణిక్యం, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌ కళాశాలలో..

మాక్లూర్‌ మండలంలోని నర్సింగ్‌ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షురాలు అంజలి డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేశా రు. ఈసందర్భంగా అంజలి మాట్లాడుతూ నర్సింగ్‌ కళాశాలను కలెక్టర్‌ సందర్శించాలని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. భోజనం కూడా విద్యార్థులే వండుతున్నారని, వీధి దీపాలు, సీసీ కెమెరాలు లేవని కలెక్టర్‌ దృష్టికి తెచ్చారు.

వంట మనుషులు, వాచ్‌మెన్‌ లేరని, నీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రహరీ లేదని, స్టైఫండ్‌ రావడం లేదని, మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగ్గా లేదని ఏఐఎస్‌ఎఫ్‌ సర్వేలో తేలిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శిరీష పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కామారెడ్డి ప్రజావాణికి 94 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ పాటిల్‌

కామారెడ్డి క్రైం : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కామారెడ్డి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 94 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 53 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా 12 మున్సిపల్‌, 7 జిల్లా పంచాయతీ, డీఆర్‌డీవోకు 6 ఫిర్యాదులు వచ్చాయి. మిగితా ఫిర్యాదులు ఆయా శాఖలకు చెందినవి నమోదయ్యాయి. కలెక్టర్‌ పాటిల్‌ ఫిర్యాదులదారుల వద్దనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్‌ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రమోహన్‌, వెంకటేష్‌ దోత్రే, శిక్షణ కలెక్టర్‌ శివేంద్ర ప్రతాప్‌, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చైనా దారం అమ్మితే కేసులు నమోదు

బాన్సువాడ టౌన్‌ : సంక్రాంతి పండగ పురస్కరించుకుని మార్కెట్‌లో వ్యాపారస్తులు చైనా మాంజను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన సోమవారం బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చైనా మాంజా కారణంగా చాలా చోట్ల ప్రమాదాలు జరిగాయని, చైనా మాంజను నిషేధించారన్నారు. సంక్రాంతి పండగలో గాలి పటాలను మామూలు దారంతోనే ఎగరేయాలన్నారు. చైనా మాంజాను విక్రయించే వ్యాపారస్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఇసుక సమస్యకు పరిష్కారం

వేల్పూర్‌ : వేల్పూర్‌ మండలం జానకంపేట పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య పెద్దవాగులో నెలకొన్న ఇసుక సమస్య సోమవారం అధికారుల సమక్షంలో పరిష్కారమైంది. తహసీల్దార్‌ శ్రీధర్‌, ఎస్సై వినయ్‌కుమార్‌, ఇరు గ్రామాల సర్పంచులు గంగారెడ్డి, రమేష్‌, ఎంపీటీసీలు, వీడీసీ సభ్యుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకున్నారు. జానకంపేట గ్రామస్తులు సోమ, శుక్రవారాలు, మిగితా రోజుల్లో నడ్కుడ గ్రామస్తులు ఇసుకను తీసుకోవాలని నిర్ణయించారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి ఎవరు కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తే రూ.2 లక్షల జరిమానా విధించేందుకు ఒప్పుకున్నారు. చాలా ఏళ్లుగా రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఇసుక సమస్యకు పరిష్కారం లభించడంతో అధికారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి



సుభాష్‌నగర్‌ : తన కుమారుడు భరత్‌ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఇది ముమ్మాటికీ హత్యేనని, వెంటనే విచారణ చేపట్టాలని నగరంలోని గాజుల్‌పేటకు చెందిన కందగిరి యాదగిరి కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ భరత్‌ తన స్నేహితులతో వెళ్లానని, పొద్దున్నే వస్తానని చెప్పి ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలున్నాయన్నారు. తన కుమారుడిని ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, ఇదే విషయాన్ని మాక్లూర్‌ ఎస్సైకి ఫిర్యాదు చేయగా, కంప్‌లైంట్‌ తీసుకోవడంలేదని తెలిపారు. వెంటనే తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రానికి తోట రాజశేఖర్‌, మండలంలోని జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన సుమలత గత కొంతకాలంగా ప్రేమించు కుంటున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో సోమవారం మెండోరా మండలం పోచంపాడ్‌ కోదండ రామాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాలు వేరు కావడంతో తమకు రక్షణ కల్పించాలని బాల్కొండ పోలీసులను ఆశ్రయించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్‌

బాల్కొండ : మెండోరా మండల కేంద్ర శివారులో సాయి గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మెండోరా ఎస్సై శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేయగా ఏడుగురు పేకాటరాయళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 4200 స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మట్కా, పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లా బాలికల హాకీ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా హాకీ జట్టు శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్‌ : ఆర్మూర్‌ పట్టణంలోని మినీ స్టేడియంలో నిజామాబాద్‌, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సబ్‌ జూనియర్‌ బాలికల హాకీ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 39 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 22 క్రీడాకారులను హాకీ శిక్షణ శిబిరానికి ఎంపిక చేశామన్నారు. ఈ శిక్షణ శిబిరం తూంపల్లిలో 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కొనసాగుతోంది. అలాగే తుది జట్టు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25, 26వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌ జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాకార్యదర్శి రమణ, కోశాధికారి పింజా సురేందర్‌, జిల్లా సంయుక్త కార్యదర్శి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతోనే ఉత్తమ ఫలితాలు

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ లింబాద్రి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రొఫెసర్‌ లింబాద్రి

సిరికొండ : చదువులో సాంకేతిక నైపుణ్యతతో రాణిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ లింబాద్రి అన్నారు. నేషనల్‌ థర్మల్‌ పవర్‌ కార్పొరేషన్‌, భారత ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇంధన సంరక్షణపై నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిరికొండ సత్యశోధక్‌ పాఠశాల విద్యార్థులు పి సోని, ఎం రిషిక్‌గౌడ్‌కు ఆయన ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చదువుతో పాటు విద్యార్థులు వివిధ అంశాలలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఆర్‌.నర్సయ్య, డీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, సతీష్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో యశ్వంత్‌ ప్రతిభ



సైక్లింగ్‌లో రజతం సాధించిన యశ్వంత్‌కుమార్‌

నిజామాబాద్‌ నాగారం : జాతీయస్థాయి సైక్లింగ్‌లో జిల్లాకు చెందిన కె యశ్వంత్‌కుమార్‌ రజత పతకం సాధించారు. ఈ నెల 7 నుంచి 10 వరకు మహారాష్ట్రలో జాతీయస్థాయి సైక్లింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు జరిగాయి. అండర్‌–23 విభాగంలో యశ్వంత్‌కుమార్‌ అత్యుత్తమ ప్రతిభ చూపి రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సైక్లింగ్‌ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, దత్తాత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కృపాకర్‌రెడ్డి, భూలోకం విజయకాంత్‌రావు, ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపల్‌ కార్పొరేషన్‌లో స.హ.చట్టానికి తూట్లు..!



నగరంలోని బల్దియా కార్యాలయంలో ఖాళీగా ఉన్న స.హ.చట్టం బోర్డు

నిజామాబాద్‌ మున్సిపాలిటీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టాన్ని అధికారులు పూర్తిగా నీరు గారుస్తున్నారు. అధికారులకు సంబంధించిన సమాచారాన్ని తెలిపే బోర్డు లేకపోవడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురువుతున్నారు. గతంలో ఉన్న సమాచారం ఉన్న బోర్డుపై తెల్లరంగు వేసేశారు. – నిజామాబాద్‌ నాగారం

యూజీ పరీక్షల్లో ఒకరి డిబార్‌

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన తెయూ కంట్రోలర్‌



తనిఖీ చేస్తున్న తెయూ కంట్రోలర్‌ అరుణ

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలో సోమవారం జరిగిన యూజీ 5వ సెమిస్టర్‌ పరీక్షల్లో మాల్‌ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఓ విద్యార్థి డిబార్‌రైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన యూజీ 2వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో 1,571 మంది విద్యార్థులకు గానూ 1425 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన 5వ, 6వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో 10,264 మంది విద్యార్థులకు గానూ 9,053 మంది హాజరు కాగా 731 మంది గైర్హాజరయ్యారన్నారు. తెయూ పరిధిలోని నరేంద్ర, సిద్దార్థ, విజేత (ఆర్మూర్‌)లోని పరీక్షా కేంద్రాలను కంట్రోలర్‌ అరుణ తనిఖీ చేశారు. తెయూ మెయిన్‌ క్యాంపస్‌లో సోమవారం ఉదయం జరిగిన పీజీ మొదటి సెమిస్టరు బ్యాక్‌లాగ్‌ పరీక్షలో 120 మంది విద్యార్థులకు గానూ 94 మంది హాజరయ్యారని కంట్రోలర్‌ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పీజీ 3వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో 101 మంది విద్యార్థులకు గానూ 92 మంది హాజరయ్యారని కంట్రోలర్‌ తెలిపారు.

హత్య కేసులో నిందితుల కోసం పోలీసుల గాలింపు



విచారణ చేస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి : గత ఆదివారం ఇబ్రహీం చావూస్‌ అలియాస్‌ జంగిల్‌ ఇబ్బు హత్య కేసులో ముగ్గురు పరారీలో ఉండటంతో పోలీసులు గాలింపు చర్యలు చేప ట్టారు. నగరంలోని ఆరో టౌన్‌ పోలీసులు పరారీలో ఉన్న నిందితులు నబీ, రహీం, ఉస్మాన్‌ల కోసం గాలిస్తున్నారు. వీరికి ఉన్న ఇల్లీగల్‌ దందాలపై పోలీసులు ఆరా తీస్తూ ఆయా ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

లైంగిక దాడి యత్నంలో జైలుశిక్ష

ఖలీల్‌వాడి : ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఎనిమిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు సోమవారం తీర్పు వెలువరించారు. నగరంలోని ఓ గల్లీకి చెందిన చిన్నారిపై అదే కాలనీ చెందిన తన్నీరు రమేశ్‌ (50) లైంగిక దాడికి యత్నించినందుకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022 మార్చ్‌ 3వ తేదీన లైంగిక దాడికి యత్నించాడని నగరంలోని మూడవ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో ముద్దాయిపై నేరారోపణలు రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ. 5 వేల జరిమానా, పోక్సో చట్టం ప్రకారం ఐదేళ్ల కఠిన శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధించారు. మొత్తంగా ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించారు. జరిమానా చెల్లించకపోతే ఆర్నెళ్ల జైలుశిక్ష అదనంగా అనుభవించాలని పేర్కొన్నారు.

గంజాయి కేసులో దంపతులకు..

నగరంలోని ఎల్లమ్మగుట్ట నడిగడ్డ నివాసులు షేక్‌ యూనస్‌, ఆయన భార్య సాజిదాపై అక్రమంగా గంజాయి కలిగి ఉన్నారనే అభియోగాలు నిర్ధారణ అయినందున వారికి ఎన్‌డీపీఎస్‌ చట్ట ప్రకారం ఒక్కొక్కరికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఇద్దరు రూ. 20 వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని నిజామాబాద్‌ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌ రావు తీర్పులో పేర్కొన్నారు.

ఇసుక అక్రమ క్వారీపై రెవెన్యూ దాడి



మాక్లూర్‌ : అక్రమంగా ఇసుక రవాణా అవుతుందన్న సమాచారం మేరకు మండలంలోని చిక్లి శివారు వల్లభాపూర్‌ వద్ద ఉన్న వాగులో సోమవారం రాత్రి తహసీల్దార్‌ శంకర్‌, ఎస్సై యాదగిరి గౌడ్‌తో కలిసి మెరుపు దాడి చేశారు. అయితే ముందే సమాచారం తెలుసుకున్న అక్రమార్కులు ట్రాక్టర్లను దాచేశారు. దీంతో వీఆర్‌ఏల సాయంతో చిక్లి గ్రామంలోకి వెళ్లి ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్‌ శంకర్‌ హెచ్చరించారు.

క్రైం కార్నర్‌

బాల్కొండలో గంజాయి పట్టివేత



తనిఖీలు చేస్తున్న పోలీసులు

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వద్ద స్కూటీలో గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారంతో బాల్కొండ ఎస్సై గోపి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 400 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. మోపాల్‌ మండలం మంచిప్ప గ్రా మానికి చెందిన ఆటో డ్రైవర్‌ పల్నాటి దిలీప్‌, మరో వ్యక్తితో కలిసి స్కూటీలో గంజాయిని విక్రయించేందుకు తీసుకొచ్చారు. దిలీప్‌ గంజాయితో పట్టుబడగా మరో వ్యక్తి పరారీలో ఉన్నడని ఎస్సై తెలిపారు. దిలీప్‌ను అదుపులోకి తీసుకుని, 400 గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో దొంగనోట్ల కలకలం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలో దొంగనోట్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ వైన్‌ షాపులో పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి దొంగ నోటు తీసుకొచ్చి మద్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా వైన్‌షాప్‌ నిర్వాహకుడు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. వారం రోజుల్లో రెండు, మూడు సార్లు దొంగనోట్లను తీసుకుని వచ్చినట్లు వైన్‌ షాప్‌ నిర్వాహకులు తెలిపారు. దీనికి పోలీసులకు ఫిర్యాదు చేయగా అవి దొంగనోట్లు కావని కిడ్డీ బ్యాంకుకు సంబంధించిన నోట్లు అని పోలీసులు తెలిపారు. ఏదేమైనా దొంగనోట్ల విషయం పట్టణంలో దావానంలా వ్యాపించడంతో స్థానికులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో సోమవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. మృతుడు వయస్సు సుమారు 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడికి సంబంధించి ఎవరైనా ఉంటే జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలన్నారు.

ఉసురు తీసిన అప్పులు

- ఉరివేసుకుని రైతు ఆత్మహత్య



సంగయ్య (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండలం బోనాల్‌ గ్రామానికి చెందిన కప్ప సంగయ్య(45) రైతు అప్పుల బాధలు భరించలేక ఆదివారం రాత్రి పంట చేను వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని మొదటి భార్య ఐదేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు. మళ్లీ రెండో వివాహం చేసుకున్నాడు. రెండవ భార్య లక్ష్మికి ఒక కుమారుడు ఉన్నాడు. వారికి గ్రామ శివారులో ఎకరం ఇరవై గుంటల భూమి ఉంది. అందులో పంటలు సాగు చేసుకోవడానికి సాగునీరు లేకపోవడంతో గతేడాది అప్పు చేసి మూడు బోర్లు వేశాడు. రెండు ఫెయిలయ్యాయి. ఒకటి కొద్దిగా నీళ్ల పోసేది. ఆ బోరు కూడా ఎత్తిపోయింది. సుమారు రూ. 4 లక్షల వరకు అప్పులు పెరిగిపోయాయి. దాంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి పంట చేనుకు వెళ్లాడు. పంట చేను సమీపంలోని మోదుగు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

సోమవారం ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పంటచేను వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని వేలాడడం కనిపించాడు. విషయాన్ని గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

- దంపతులను బలి తీసుకున్న జూదరులు



రెంజల్‌(బోధన్‌): ఇద్దరు వృద్ధ దంపతులను జూదరులు పొట్టన పెట్టుకున్నారు. గత నెలలో నగల కోసం చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధులు పది రోజుల వ్యవధిలో తనువు చాలించారు. రెంజల్‌ మండల కేంద్రంలో గత నెల 23వ తేదీన ఊరి చివర ఉన్న ఇంట్లో నిద్రిస్తున్న జల్ల చిన్న నాగన్న(73), ఆయన భార్య శకుంతలను వారి సమీప బంధువైన వ్యక్తి, అతని మిత్రుడితో కలిసి దాడి చేశారు. వారిని గుర్తుపట్టకుండా ఉండేందుకు తీవ్రంగా గాయపర్చి వృద్ధురాలి మెడలోని నగలను ఎత్తుకెళ్లారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శకుంతలను హైదరాబాద్‌ తరలించినా ప్రయోజనం లభించలేదు. అదే నెల 29వ తేదీన శకుంతల మృతిచెందగా ఆదివారం అర్ధరాత్రి భర్త నాగన్న మృతిచెందాడు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అందించారు.


కడుపునొప్పి భరించలేక..



సంగవ్వ (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం ఐలాపూర్‌ గ్రామానికి చెందిన వివాహిత గజ్జె సంగవ్వ(44) కడుపునొప్పి భరించలేక ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. ఐలాపూర్‌నకు చెందిన గజ్జె ఆనంద్‌కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సంగవ్వ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఆస్పత్రుల్లో చూపించినా, మందులు వాడినా ఫలితం లేకుండాపోయింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఆదివారం రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత మరోగదిలోకి వెళ్లి దూలానికి ఉరేసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి దూలానికి వేలాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు కారణాలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్న వేధింపులకు తమ్ముడు..



పోశెట్టి మృతదేహం

మాక్లూర్‌ : వ్యవసాయ భూమి విషయంలో సోమవారం అన్నా తమ్ముడి మధ్య జరిగిన తగాదాలో మనోవేదనకు గురైన తమ్ముడు డి పోశెట్టి (41) గుండెపోటుతో మృతి చెందినట్లు మాక్లూర్‌ ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపా రు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదులో తన బావ గోపాల్‌ వ్యవసాయ భూమి విషయంలో తన భర్త పోశెట్టిని మానసికంగా ఇబ్బందికి గురిచేయటం వల్లే మృతి చెందాడని పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.